పెద్దారెడ్డి చుట్టూ వివాదం..!

◆ మొన్న ఇల్లు.. నేడు భూముల సమస్య..

◆ అక్రమంగా భూమి కొన్నారంటూ విచారణ

◆ అధికారం పోగానే సీన్ రివర్స్

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మరో వివాదంలో చిక్కుకున్నారు. ఇప్పటికే తాడిపత్రిలో మున్సిపల్ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, దీనిని కూల్చివేస్తామంటూ మున్సిపల్ ఛైర్ పర్సన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రకటించారు. తాజాగా తన సొంత ప్రాంతంలో అక్రమంగా భూములు లాక్కున్నారంటూ ఇన్‌ఛార్జి మంత్రికి పెద్దారెడ్డిపై జెసి.ప్రభాకర్‌రెడ్డి మరొక ఫిర్యాదు చేశారు. గతంలోనే దీనిపై విచారణ చేయాలని ఆదేశించినా.. ఎందుకు చేయడం లేదని నిలదీయడంతో దానిపై అధికారులు ఇప్పుడు విచారణ చేపట్టారు. ఇంతకీ పెద్దారెడ్డి విషయంలో ఏం జరుగుతోందన్న విషయంపై రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

అధికారం ఉంటే ఏం చేసినా రైట్ గానే కనిపిస్తుంది. తప్పు కూడా ఒప్పే అన్న విధంగా అంతా నమ్మాల్సి వస్తుంది. అదే అధికారం పోతే సీన్ మొత్తం రివర్స్ అవుతుంది. ఒక్కోసారి మంచి కూడా చెడుగానే కనిపిస్తోంది. తాజాగా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విషయంలో కూడా అదే జరుగుతోంది. మొన్నటి వరకు ఐదేళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉన్న పెద్దారెడ్డికి కూటమి ప్రభుత్వంలో వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. గత ఐదేళ్ల తప్పిదాలపై వరుసగా ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్తున్నాయి. తాడిపత్రిలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పెద్దారెడ్డి ఒక ఇల్లు నిర్మించుకున్నారు. ఆ ఇంటి ముందు భాగం మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి నిర్మించారని ఆరోపణాలున్నాయి. మున్సిపల్ ఛైర్మన్ హోదాలో ఉన్న ఆయన ఆఇంటిని కూల్చివేస్తామని ప్రకటించారు. ఇదే విషయంపై అధికారులు నోటీసులు కూడా ఇచ్చామని చెబుతున్నారు.

తెరపైకి భూ వివాదం..!

పెద్దారెడ్డి ఇంటి వివాదం నడుస్తుండగానే భూముల అంశంపై తెరపైకి వచ్చింది. గత ఐదేళ్లలో ఆయన కొన్న భూముల విషయంపై ఫోకస్ చేసి వాటిని ముఖ్యమంత్రి వరకు జెసి.ప్రభాకర్‌రెడ్డి తీసుకెళ్లారు. గతేడాది నవంబర్ 25న సిఎంకు లేఖ రాశారు. ఇందులో పుట్లూరు మండలంలోని కోమటికుంట్ల, చిన్నమల్లెపల్లి, గరుగుచింతలపల్లి గ్రామాల్లో గత నాలుగు సంవత్సరాల క్రితం పెద్దారెడ్డి ఆయన కుటుంబ సభ్యులు కలిసి దాదాపు 126.9 ఎకరాల్లో సాగుభూమి కొన్నారు. సదురు భూమిలో గతంలో సోలార్ ప్లాంట్ నిర్మాణం కోసం కొన్న కొంతమంది చిన్న రైతుల నుంచి అక్రమంగా ఎంతో కొంత డబ్బులు ఇచ్చి బెదిరించి వారి నుంచి కొన్నారనేది ప్రస్తుతం ఉన్న ఆరోపణ. 126.90 ఎకరాలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వారి కుటుంబ సభ్యులు దగ్గర ఉంటే, అది సీలింగ్ చట్టం కింద అక్రమమని అందుకే ఆ భూమిని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకు సాగుకు ఇవ్వాలని జేసీ ప్రభాకర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చినా స్థానికంగా ఉన్న అధికారులు పట్టించుకోలేదని జెసి.ప్రభాకర్ రెడ్డి ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని పుట్లూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇన్‌ఛార్జి మంత్రి టిజి.భరత్ దష్టికి ఇటీవల తీసుకెళ్లారు. పెద్దారెడ్డి ప్రభుత్వ భూముల ఆక్రమణ, సోలార్ భూములను బలవంతంగా రాపించుకోవడం, రస్తా దారికి గేటు వేయడంపై రెవెన్యూ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదన్న విషయాన్ని మంత్రి దృష్టి తీసుకెళ్లారు. భూమి సర్వే చేసి విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేసి 5 నెలలు కావస్తున్నా పట్టించుకోలేదని మంత్రి టిజి భరత్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి స్పందిస్తూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. మంత్రి ఆదేశాలతో ఈ భూములను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. హద్దుల రాళ్లను తనిఖీ చేశారు. సర్వే పూర్తయిన వెంటనే నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇలా వరుస వివాదాల్లో చిక్కుకుపోతున్న పెద్దారెడ్డి అంశం వైసిపి శ్రేణులను కలవరపాటుకు గురి చేస్తోంది.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

అడ్డున్నా.. హాని కలిగినా..!

ప్రజల సౌకర్యం కోసం చేపడుతున్న పలు అభివృద్ధి పనులు అధికారుల అలసత్వంతో నవ్వుల పాలవడమే కాక, ప్రజల ప్రాణాలకు హాని చేసేలా మారుతున్నాయి. అభివృద్ధి పేరుతో ప్రజలకు మేలు చేయడం అటుంచి వారి ప్రాణాల మీదుకు తెచ్చేలా పరిస్థితులు కన్పిస్తున్నాయి. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గుట్టూరు, పెనుకొండ పట్టణంలో ఇటీవల రోడ్డు నిర్మాణ పనులు చేశారు. ఈ పనులు చేసే సమయంలో రోడ్డు పక్కన ఉన్న ప్రజల ఇళ్లను కూల్చివేశారు. ఇళ్లను కూల్చివేసిన అధికారులకు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు, చేతిపంపులు కన్పించకపోవడం గమనార్హం. రోడ్డుపై విద్యుత్ స్తంభం, చేతి పంపు ఉన్నా వాటిని తొలగించకుండా అలాగే సిసి రోడ్డు వేశారు. ఇదేమిటని ఎవరైనా సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే విద్యుత్ శాఖకు లేఖ ఇచ్చాం.. వారు స్పందించలేదని ఒకరంటే.. మాకు ఎలాంటి లేఖ అందలేదని మరోశాఖ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇలా ఒక శాఖపై మరొక శాఖ నెపం వేసుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

గుట్టూరు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

◆ రోడ్డుమధ్యలో విద్యుత్ స్తంభాలు,చేతిబోరు

◆ అధికారుల నిర్లక్ష్యం..ప్రజల ప్రాణాలతో చెలగాటం

◆ గుత్తేదారుల లబ్ధికోసం ఆఘమేఘాలపై పనులు ప్రారంభం

◆ ఒకశాఖపై మరొకశాఖ నెపం నెట్టుకునే ప్రయత్నం

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ మండలం గుట్టూరులో ఇటీవల సిసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. గుట్టూరు-కొత్తచెరువు రోడ్డు నిర్మాణ పనులను రూ.20 కోట్లతో పాత జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. రోడ్డుకు ఒక వైపు ప్రభుత్వ పాఠశాల మరో వైపు ప్రజల ఇళ్లు ఉన్నాయి. రోడ్డు వెడల్పు చేసే క్రమంలో ఆక్రమిత స్థలం పేరుతో కొందరి ఇళ్లను అధికారులు కూల్చి వేశారు. అనంతరం సిసి రోడ్డు వేశారు. ప్రజల ఇళ్లను కూలగొట్టిన అధికారులు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాలను మాత్రం తొలగించలేదు. విద్యుత్ స్తంభాన్ని అలాగే ఉంచి రోడ్డు వేశారు. ప్రజల ఇళ్లను కూల్చడంపై అధికారులు చూపిన శ్రద్ధ రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మాత్రం తొలగించలేదు. రోడ్డు మధ్య స్తంభాలు ఉండడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పి స్తంభాలకు ఢీకొంటే ప్రాణాలు పోగొట్టుకోవాల్సిన ప్రమాదం ఉంది.

పెనుకొండ రైల్వేస్టేషన్ రోడ్డు మధ్యలో ఉన్న చేతిపంపు

గుత్తేదారులకు లబ్ధికోసమే పనులు..!

గుత్తేదారుల లబ్ధికోసం ఆగమేగాలపై రోడ్లు పనులు ప్రారంభించనట్లు విమర్శలు విన్పిస్తున్నాయి. పనులు వేగవంతంగా పూర్తి చేసి బిల్లు మంజూరు చేయించుకోవాలనే ఆత్రుతతో ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు ప్రజాశ్రేయస్సు మరిచి గుత్తేదారుల లబ్దికోసం పని చేస్తున్నారని పలువులు అభిప్రాయ పడుతున్నారు.

ఒకశాఖపై మరొక శాఖ...

రోడ్డు విస్తరణలో విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలోకి వచ్చాయని వాటిని మార్చాలని విద్యుత్ శాఖకు లేఖ ఇచ్చామని రోడ్లు భవనాల శాఖ ఏఈ వెంకటేశులు చెబుతున్నారు. అసలు తమకు ఎలాంటి లేఖ ఇవ్వలేదంటూ విద్యుత్ శాఖ ఏఈ నారాయణస్వామి అంటున్నారు. ఇలా అధికారుల మధ్య సమన్వయం లేక ప్రజలను ఇబ్బందుల పాలుజేస్తున్నారు. విద్యుత్తు స్తంభాలు మార్చాలంటే నిబంధనల ప్రకారం చెలానా రూపంలో విద్యుత్ శాఖకు నగదు చెల్లించాలి. గుత్తేదారులు రోడ్డు నిర్మాణం ప్రారంభించక ముందే ఈ తంతూ పూర్తి చేస్తే విద్యుత్ స్తంభాలు మార్పు చేస్తారు. ఇక్కడ అలాంటివేమీ చేయలేదు. పైగా ఒకరి పై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కాలం గడిపేశారు. గుత్తేదారు మాత్రం తన పని తాను చేసుకుంటూ పోయారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేసుకున్న తర్వాత స్తంభాలు తొగింపు సాధ్యం కాదు. పూర్తిగా ధ్వంసం చేయాలి. ఇలా ప్రజా ధనం వృథా చేయడంపై అధికారులు పోటీ పడుతుండడం విస్మయానికి గురి చేస్తోంది.

రోడ్డుమధ్యలో విద్యుత్ స్తంభాలు, చేతిబోరు..!

పెనుకొండ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు నిర్మాణంలో గుత్తేదారు రోడ్డు మధ్యలో చేతిపంపు ఉంచి రోడ్డు వేశారు. మరో గుత్తేదారు రోడ్డు మధ్యలో రెండు విద్యుత్ స్తంభాలు ఉంచి రోడ్డు వేసేశారు. కనీసం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే సమయంలో సంబందిత శాఖ అధికారులు పర్యవేక్షణ ఉండాలి. రోడ్ల మధ్యలో ఉన్న చేతి పంపులు, విద్యుత్ స్తంభాలను ఆయా శాఖల అధికారులతో చర్చించి తొలగించాలి. అయితే సంబంధిత అధికారులు మాత్రం అలాంటివేవీ చేయకుండానే పనులు చేపట్టేందుకు గుత్తేదారులకు అవకాశం కల్పించి రోడ్డు పనులను పూర్తి చేయించారు.

విద్యుత్ స్తంభాలకు ఎర్రగుర్తు వేయిస్తాం

వెంకటరామిరెడ్డి, ఆర్ అండ్ బి డిఈ

కొత్తగా వేసిన రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలున్నాయని వీటి వల్ల ప్రజలకు ప్రమాదం అని ఆర్‌అండ్‌బి డిఈ వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన విద్యుత్తు స్తంభాలకు ఎర్రరంగు గుర్తు వేస్తామని పేర్కొన్నారు. స్తంభాలు తొలగించాలని విద్యుత్ శాఖకు లేఖ ఇచ్చినా వారు స్పందించలేదన్నారు.

ఎర్ర రంగుతో ప్రమాదాలు జరగవా..?

హరి, సిపిఎం జిల్లా నాయకుడు.

రోడ్డు మధ్య విద్యుత్ స్తంభాలకు ఎర్రరంగు గుర్తులు ప్రమాదాలు జరగకుండా ఆగుతాయాని సిపిఎం నాయకులు హరి అధికారులను ప్రశ్నించారు. గుత్తేదారులకు మేలు చేయడం కోసం అధికారులు ఆగమేఘాలపై పనులు ప్రారంభిస్తున్నారన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా ఉన్న విద్యుత్తు స్తంభాలు తక్షణం తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

డీలర్లకు పూర్తి కోటా బియ్యం ఇవ్వాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

రేషన్ డీలర్లకు కచ్చితమైన తూకంతో పూర్తి కోటా బియ్యం ఇవ్వాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. ఆమె శుక్రవారం ఎంఎల్ఎస్ పాయింట్ ను సందర్శించి స్టాక్ వివరాలు తెలుసుకు న్నారు. రికార్డులు, బియ్యం బస్తాల తూకాలను పరిశీలించారు. ప్రతి నెలా బఫర్ పేరుతో కోతలు విధిస్తున్నా రన్న డీలర్ల ఫిర్యాదులపై ఆరా తీశారు. గత వైసిపి ప్రభుత్వంలో చేసిన తప్పిదాలకు ఇప్పటి డీలర్లు, ప్రజలు ఎందుకు ఇబ్బంది పడాలని అధికారులను ప్రశ్నించారు. ఇక నుంచి బఫర్‌తో సంబంధం లేకుండా డీలర్లకు పూర్తి కోటా బియ్యం సరఫరా చేయాలని ఆదేశించారు. డీలర్లు కూడా రేషన్‌కార్డుదారులకు తూకం తక్కువ లేకుండా సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఫిర్యాదులు వస్తే డీలర్ షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

త్వరలోనే అర్హులందరికీ ఇళ్ల పట్టాలు, ఇళ్లు

త్వరలోనే అర్హులందరికీ ఇళ్ల పట్టాలతో పాటు ఇళ్లు కూడా మంజూరు చేస్తామని ఎమ్మెల్యే సునీత తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యేతో పాటు తహశీల్దార్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. పలు గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి అర్జీలు ఇచ్చారు. ఎక్కువగా భూసమస్యలు, ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణంపై అర్జీలు ఇచ్చారు. ఫ్రీహోల్డ్, చుక్కల భూములు, అన్నదమ్ముల మధ్య భూ సమస్యలు వచ్చాయి. రెవెన్యూ సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

పేదలకు నివాస హక్కులు కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని పాలసముద్రం వద్ద సిపిఎం కాలనీలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు నివాస హక్కులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవా రం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వ్యకాసం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ సిపిఎం కాలనీలో పేదలు గుడిసెలు, తాత్కాలిక ఇళ్లు కట్టుకొని నివాసం ఉంటున్నారన్నారు. అక్కడ నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్‌కు నీరివ్వడంతో పాటు హైకోర్టు ఉత్తర్వుల మేరకు పేదల నివాస స్థలాలకు హక్కులు కల్పించాలని కోరారు. కాలనీకి నీరిచ్చే వరకూ వెళ్లేది లేదని కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ప్రదీప్‌కు వినతి పత్రం ఇచ్చారు. వీరి సమస్యపై ప్రదీప్ ఫోన్ ద్వారా తహశీల్దార్, ఎంపిడిఒతో మాట్లాడి నీరివ్వడానికి ప్రయత్నం చేస్తామని తెలిపినా వారు ససేమిరా అన్నారు. ధర్నాలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు ముత్యాలప్ప, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ నాయకులు అంజనాదేవి, వెంకటలక్ష్మమ్మ, అచ్చమ్మ, లక్ష్మీదేవి, అశ్వర్థమ్మ, గంగమ్మ, శోభ, వెంకటరాముడు, రవీంద్ర, లోకేష్, గంగాధర్ పాల్గొన్నారు.



రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రం ఇస్తున్న వ్యకాసం నాయకులు

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు వర్ష ఎంపిక

లేపాక్షి : మండలంలోని పులమతి జడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న వర్ష జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు రామాంజనేయులు తెలిపారు. వర్ష ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకూ మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఇటీవల హిందూపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టు విజేతగా నిలవడంతో కీలకపాత్ర పోషించి జాతీయజట్టులో చోటు దక్కించుకుందన్నారు. వర్ష ఎంపిక పట్ల హెచ్‌ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి ఛైర్మన్ నరసింహమూర్తి, సర్పంచి అశ్వత్థప్ప, వ్యాయామ ఉపాధ్యాయులు రామాంజనేయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

మడకశిరకు అతిపెద్ద సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు

ప్రజాశక్తి-మడకశిర

ఎన్నికల హామీ మేరకు వలసలను నివారించేందుకు నియోజకవర్గానికి అతి పెద్ద సోలార్ ప్రాజెక్టు లు తీసుకొచ్చామని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్యే ఎంఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి జీవో-39ని చూపిస్తూ విలేకరులతో మాట్లాడారు. మండలంలోని హారేసముద్రం, వైబి.హళ్లి, బుల్లసముద్రం, మనూరు, కల్లుమర్రి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో దాదాపు 10వేల ఎకరాల్లో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం ద్వారా 7500 మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. దీనివల్ల 220 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్లు, అనుబంధ పరిశ్రమలు వచ్చి మరో వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందన్నారు. గుడిబండ ప్రాంతంలో 2 వేల మెగావాట్లకు సంబంధించి టాటా కంపెనీ వారు సోలార్ పార్కు ఏర్పాటు కోసం ఇప్పటికే భూములను పరిశీలించారన్నారు. మరో 10 రోజుల్లో జీవో విడుదలవుతుందన్నారు. రైతులకు ఎకరాకు రూ. 31వేలు ఇచ్చేలి జీవో ఇచ్చారన్నారు. వీటితో పాటు డిఫెన్స్ సంబంధిత పరిశ్రమ కూడా రాబోతుందన్నారు. త్వరలో ఇండియన్ డిజైన్స్ గార్మెంట్ పరిశ్రమను ప్రారంభించి 3వేల మందికి ఉపాధి కల్పించబోతున్నామని తెలిపారు.

మహిళల రక్షణ, అభివృద్ధికి తొలి ప్రాధాన్యం : ఎమ్మెల్యే

మహిళల అభివృద్ధి, రక్షణ విషయంలో సిఎం చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారని ఎమ్మెల్యే ఎమ్మెస్.రాజు తెలిపారు. పట్టణంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్కచెల్లెమ్మల కష్టాలు చూసి 'దీపం' పేరుతో దేశంలోనే తొలిసారిగా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిన ఏకైక సిఎం, డ్వాక్రా సంఘాల సృష్టికర్త చంద్రబాబే అన్నారు. కుటుంబ సాధికార సారథుల నియామకం ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని నాయకులకు సూచించారు. అనంతరం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించి మహిళలతో మాట్లాడారు. సమావేశం లో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, కుంచిటి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం.పాండురంగప్ప, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గురుమూర్తి, జడ్పిటిసి ఉమేష్, మండల కన్వీనర్లు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

గౌరీశంకర్‌ను అభినందిస్తున్న ఎంఇఒ ఆంజనేయులు

దివ్యాంగుల రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఏలూరు జిల్లాలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకూ జరిగిన దివ్యాంగుల రాష్ట్ర స్థాయి స్పెషల్ ఒలింపిక్స్‌లో 100, 200 మీటర్ల పరుగు పందెంలో సోమందేపల్లికి చెందిన గౌరీశంకర్ ప్రతిభ చాటాడు. గౌరీశంకర్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పరుగు పందెం పోటీల్లో ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు పిఇటిలు వన్నూరప్ప, విజయ రామారావు, రమేష్ తెలిపారు. గౌరీశంకర్‌ను ఎంఇఒ ఆంజనేయులునాయక్ అభినందించారు.

సిపిఎం నుంచి బహిష్కరణ

సోమందేపల్లి : మండల పార్టీ సభ్యులుగా ఉన్న రాజగోపాల్, చాంద్‌బాషాలను సిపిఎం నుంచి బహిష్కరించి నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి రంగప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరిద్దరూ చాలా రోజులుగా పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా ప్రవర్తించగా గతంలోనే పార్టీ పలుమార్లు మందలించినా వారి తీరులో మార్పులేదన్నారు.

బదిలీ న్యాయమూర్తికి సన్మానం

పెనుకొండ : పట్టణంలోని సబ్ కోర్టు న్యాయమూర్తి ముజీబ్ పసఫల సయ్యద్ పుట్టపర్తికి బదిలీ అయ్యారు. దీంతో శుక్రవారం న్యాయవాదులు శర్మ, నాగరాజు ఆధ్వర్యంలో జడ్జి ముజీబ్ దంపతులను న్యాయవాదులు కోర్టులో ఘనంగా సన్మానించారు. న్యాయవాది నాగరాజు మాట్లాడుతూ జడ్జి ముజీబ్ కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు, జూనియర్ నాయవాదులు వృత్తిలో రాణించేందుకు మెలకువలు నేర్పించారన్నారు. అలాగే న్యాయమూర్తి చేసిన సేవలను కొనియాడారు. జడ్జి ముజీబ్ మాట్లాడుతూ పెనుకొండ కోర్టులో జడ్జిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత న్యాయవాదులందరూ సహకరించారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వాల్మీకి శ్రీనివాసులు, గౌతమి, జావీద్, బాలాజీ, హరి, నాగిరెడ్డి, నవీన్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

రాగుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

లేపాక్షి : మండలంలో ప్రాథమిక సహకార పరపతి కేంద్రం ద్వారా క్వింటా రాగులు రూ. 4,290తో కొనుగోలు చేస్తారని ఎడిఎ సనావుల్లా సూచించారు. రాగులు కొనుగోలుకు కావాల్సిన గోనెసంచులు, రవాణా ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కావున రైతులు రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకొని రాగి పంటను మద్దతు ధరకు అమ్ముకోవాలని సూచించారు. అనంతరం చోలసముద్రం గ్రామంలో మహిళా రైతు గంగరత్నమ్మ పొలంలో శుక్రవారం పిఎండిఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఎడిఎ మాట్లాడుతూ పిఎండిఎస్ పద్ధతిలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. నాగానపల్లిలో భూసార ఆధారిత ఎరువుల వాడకం, మట్టి నమూనాల సేకరణ విధానంపై రైతులకు వివరించారు. ఆయన వెంట ఏవో శ్రీలత, ఎఇఒ, ఆర్‌ఎస్‌కెఉ సిబ్బంది, మాజీ ఎంపిపి ఆనంద్‌కుమార్, నరసప్ప, బసప్ప, తిరుమలేష్, సురేష్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

నియోజకవర్గానికి 10 వేల రూఫ్‌టాప్ యూనిట్లు

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పీఎం సూర్యఘర్ పథకం కింద జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి 10 వేల రూఫ్‌టాప్ యూనిట్లు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నియోజకవర్గాల అభివద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం 60 వేలు రాష్ట్ర ప్రభుత్వం 55 వేల రూపాయలు సబ్సిడీ అందించి 100 శాతం ఉచితంగా అందిస్తుందన్నారు. బీసీలకు కేంద్రం రూ.60 వేలు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల రూపాయలు అందిస్తుందని మరో రూ.35 వేలు లబ్ధిదారులు బ్యాంకు రుణం పొంది ఐదేళ్లలో తిరిగి చెల్లించవచ్చన్నారు. ఆర్డీవోలు సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ప్రత్యేక అధికారులు, డీఈవోలు, తహశీల్దార్లు, ఏపీఎం, బ్యాంకర్లు, విద్యుత్ అధికారులు అందరి సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ విజయ సారధి, ఆర్డీవోలు సువర్ణ, మహేష్, ఆనంద్, డిపిఒ సమత, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, సిపిఒ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మలేరియా నివారణపై ర్యాలీ

ప్రజాశక్తి-లేపాక్షి

మలేరియా నివారణపై శుక్రవారం స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి వెంకటచిరంజీవి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది లేపాక్షి పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా జ్వరం వల్ల కలిగే నష్టాలు, నివారణ, నిర్మూలన చర్యలు, పరిసరాల పరిశుభ్రత, జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిం చారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ర్యాలీలో సిహెచ్ఒ సీతా మహాలక్ష్మి, ఎంపిహెచ్ఒ సుబ్రమణ్యం, భాగ్యలక్ష్మి, ఆరోగ్య ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమందేపల్లి : ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ ఓంకార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల వల్ల మలేరియా వస్తుందని కావున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దోమకాటు బారిన పడకుండా దోమతెరలు వాడాలన్నారు. కాలుష్య కారకాలైన రసాయనాలు వాడకుండా వేపాకు పొగ ఉపయోగించాలని, తాగే నీటిపై మూతలు ఉంచాలన్నారు. ప్రతి ఫ్రైడే డ్రై డేగా పాటించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మనోహర్‌రెడ్డి, రవీంద్ర, అనిల్‌కుమార్, సురేష్, శ్రీనివాసులు, ఎఎన్ఎంలు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక పిహెచ్‌సిలో డాక్టర్ భాగ్యలక్ష్మి మలేరియా నివారణపై ఆశా వర్కర్లకు పలు సూచనలు చేశారు. దోమ కాటు ద్వారా వచ్చే వ్యాధులు, జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రొద్దంలో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ చేపట్టిన వైద్యసిబ్బంది

ప్రజాశక్తి www.prajasakti.com

అర్హులందరికీ ఇళ్లస్థలాలివ్వాలి : సిపిఎం

చిలమత్తూరులో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, పేదలు

హిందూపురంలో రిలేదీక్షల్లో పాల్గొన్న నాయకులు, పేదలు

తనకల్లులో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, పేదలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు మండల వ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలకు గృహాలు మంజూరు చేయాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద పేదలు రిలే నిరాహార దీక్షను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జడ్పీ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెండు సంవత్సరాలుగా కోడూరు పంచాయతీ పరిధిలోని 805, 805-6, 805-7 సర్వే నెంబర్లలో దాదాపు 200 మంది ఇల్లు లేని పేదలు తాత్కాలిక గుడిసెలు నిర్మించుకుని అక్కడే నివాసం చేస్తున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు హైకోర్టు తీర్పుని కూడా గౌరవించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మే 5వ తేదీన జిల్లా వ్యాప్తంగా ఇళ్ల పట్టాల కోసం పోరాడుతున్న పేదలందరినీ కలుపుకొని ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్న ఏ ఒక్క సంక్షేమ పథకము అమలు చేయలేదన్నారు. ఒకటిన్నర సంవత్సరం నుండి పేద ప్రజల ఇళ్ల స్థలాల కోసం తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉన్నారని అన్నారు. వారికి తక్షణమే ఇళ్ల పట్టాలతో పాటు గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, బలాపురం వెంకటేష్, రమేష్, నందీష్, ఇళ్ల స్థలాల పోరాటం నాయకులు నరసింహ, సదాశివరెడ్డి, నాగరాజు, అశోక్ రెడ్డి, నాగరాజు, రహమతుల్లా, రామాంజి, నారాయణప్ప, రజియా భాను, గోపాలప్ప, నరసింహప్ప, అలివేలమ్మ, సరస్వతమ్మ, అంజి, నాగమణి, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : సిపిఎం కాలనీలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు వెంటనే ఇంటి పట్టాలను మంజూరు చేయడంతో పాటు కాలనీలో ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు జెడ్ పి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రిలే దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పి శ్రీ నివాసులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతు హిందూపురం పట్టణ సమీపంలోని కొల్లకుంట సమీపంలో సొంతిల్లు లేని నిరుపేదలు ఇంటి స్థలాలు కేటాయించాలని సిపిఎం ఆధ్వర్యంలో భూ పోరాటం ద్వారా గుడిసెలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఆ స్థలాల్లో ఇళ్ల పట్టాలను మంజూరు చేయించాలని కోరుతూ వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలను చేయడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇంటి ముందు ఆందోళన చేసి బాలయ్య పిఎలకు సైతం సమస్యను వివరించామన్నారు. అయినప్పటికి సొంతిల్లు లేని వారికి అధికారులు ఇళ్ల పట్టాలను మంజూరు చేయక పోగా పోలీసులను అడ్డుపెట్టకుని అప్పులు చేసి వేసుకున్న గుడిసెలను అర్ధ రాత్రి నిర్దాక్షణ్యంగా కూల్చారన్నారు. అధికారులు, పాలకులు న్యాయం చేయక పోవడంతో సిపిఎం ఆధ్వర్యంలో ఇండ్ల స్థలాల పోరాట కమిటీ వారు గత ఫిబ్రవరి నెలలో హైకోర్టు ఆశ్రయించామన్నారురు. పరిశీలన చేసిన న్యాయస్థానం పేదలకు న్యాయం చేయాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేసిందనిఅయినప్పటికి హై కోర్టు ఉత్తర్వులను ఇంత వరకు అమలు చేయాలేదని విమర్శించారు. వెంటనే హై కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలన్నారు. లేని పక్షంలో పేదలంరితో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలను చేస్తాం అన్నారు. ఈ దీక్షల్లో కెవిపిఎస్ రాయుడు, రామాంజి, నరసింహ, సరస్వతి, అంజలి, రత్నమ్మ, ఆంజనేయులు, మూర్తి, శాంతమ్మతో పాటు పేదలు పాల్గొన్నారు.

తనకల్లు : అర్హులైన పేదలందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ రవి కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనకల్లు గ్రామం సర్వేనెంబర్ 793 లో ఉండే ప్రభుత్వ భూమి12 ఎకరాల 87 సెంట్లు ఉందని అందులో సుమారు 4, ఎకరాల విస్తీర్ణంలో సుమారు 5, సంవత్సరాల క్రితం తనకల్లు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఇల్లు లేని నిరుపేదల కోసం ప్రజా సంఘాలు, రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో భూ పోరాటం చేశామని చెప్పారు. మండల వ్యాప్తంగా ఉన్న ఇల్లు లేని నిరుపేదలకు స్థలాలు చూపించి గుడిసెలు వేయడం జరిగిందన్నారు. అక్కడే నివాసం ఉంటున్న సమయంలో గాలి వానలకు గుడిసెలు కూలిపోయాయన్నారు. గత వైసిపి ప్రభుత్వం 90 రోజుల్లో పట్టాలిస్తామని చెప్పి ఒక్క పట్టా కూడా ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవటంతో ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా పేద ప్రజలకి ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం. శివన్న, సిఐటియు మండల కన్వీనర్ ఒంటెద్దు వేమన్న, వ్యవసాయ కార్మిక సంఘం శ్రీనివాసులు, రైతు సంఘం చలపతి, నాగేంద్ర నాయుడు, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని నిరుపేదలకు ఇళ్లస్థలాలిచ్చి గృహాలు నిర్మించి ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, వివి రమణ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు పట్టణాలలో రెండు సెంట్లు స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టిస్తామని ఎన్నికలలో వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం ఇంతవరకు ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వం కూడా ఇలాగే మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని లేని పక్షంలో పేదలందరినీ ఐక్యం చేసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినత పత్రాన్ని తహశీల్దార్ రామాచారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ కుళ్లాయప్ప, అంజి, శేఖర, వెంకటేష్, సాయి లీల తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

బుక్‌లెట్ విడుదల చేస్తున్న నాయకులు

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మే 20న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేద్దామని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు శుక్రవారం పట్టణలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేశవ్యాప్త సమ్మెకు సంబంధించి బుక్‌లెట్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ జే వి రమణ, జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ ఆదిశేషు, చేనేత కార్మిక సంఘం నాయకులు ఎస్‌హెచ్ బాషా, టి ఆయుబ్ ఖాన్ ఎల్ ఆదినారాయణ, ఎస్ హైదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జానపద ఉత్సవం

ప్రజాశక్తి-పావగడ

పట్టణంలోని వైఈ రంగశెట్టి డిగ్రీ కళాశాలలో శుక్రవారం జానపద ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణాన్ని జానపద కళాఖండాలతో సుందరంగా అలంకరించారు. అధ్యాపకులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణాన్ని మినుము, బియ్యం, గోధుమలతో సహా అన్ని ధాన్యాలతో అలంకరించి, ధాన్యం పూజ చేసి జానపద ఉత్సవాన్ని ప్రారంభించారు. విసరరాయి తిప్పడం ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన సన్ననాగప్ప గ్రామీణ జానపద సంస్కృతి వైభవం, పావగడ జానపద వారసత్వం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.శ్రీధర్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకులు ఎ.కంపయ్య, అధ్యాపకులు లింగరాజు, రామాంజి, గిరీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉగ్రదాడులు దారుణం

పలుచోట్ల ర్యాలీలు

ప్రజాశక్తి- హిందూపురం

జమ్మూకాశ్మీర్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడి హేయమైన చర్య అని హిందూపురం క్రైస్తవ పాస్టర్లు, నాయకులు అన్నారు. ఉగ్రదాడిని ఖండిస్తూ క్రైస్తవుల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించి, మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని అంబేద్కర్ సర్కిల్లో ప్రార్ధిస్తూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్. పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ సూర్యప్రకాష్ స్టీఫెన్ రాజ్, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, దేవరాజ్, జేమ్స్, సాల్మన్ రాజ్, దేవరాజ్ ఆంజనేయులు, డేవిడ్, డ్యానియల్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : కాశ్మీర్ ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబాలకు విశ్రాంత ఉపాధ్యాయుడు, టిడిపి ఎస్సీ సెల్ నాయకుడు ఉమ్మల చంద్రశేఖర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన, ప్రజాస్వామ్య సుస్థిరతకు విఘాతం కల్గిస్తూ ఉగ్రవాదానికి పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

ధర్మవరం రూరల్ : కాశ్మీర్ పెహల్గాంలో ఉగ్రవాద దాడిలో మృతులకు సంతాపం తెలియజేస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన రెడ్డి,పార్టీ నాయకులు,కార్యకర్తలు,వీర మహిళలతో కలిసి శుక్రవారం ధర్మవరం పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్ నుంచి అంజుమాన్ సర్కిల్ వరకు ర్యాలీ కార్యక్రమం చేశారు ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కోటి రెడ్డి రాజారెడ్డి, చిలకం వెంకటరెడ్డి,జయరామి రెడ్డి, డిష్ రాజు, ముచ్చురామి సుధాకర్ రెడ్డి, లింగాల ప్రకాష్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : జమ్మూ కాశ్మీర్‌లోఉగ్రవాదుల దాడిని వ్యతిరేకిస్తూ శుక్రవారం ముతవల్లి సయ్యద్ బాషా ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మసీదులో ప్రార్ధనల అనంతరం జామియా మసీదు నుంచి కొవ్వొత్తులు, జాతీయ జెండా చేత పట్టుకొన శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

మున్సిపాల్టీలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే కందికుంట సచివాలయ ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని వారికి సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంపై శిక్షణ కార్యక్రమాలు : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

కిసాన్ డ్రోన్ వినియోగంపై రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులు ఆదేశించారు. శుక్రవారం స్థానిక సాయి ఆరామంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కిసాన్ డ్రోన్ వినియోగంపై గ్రూప్ కన్వీనర్, కో కన్వీనర్లకు, బ్యాంకు, వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం పుట్టపర్తి రూరల్ పరిధిలోని పోలీస్ పేరడ గ్రౌండ్ సమీపంలో పంట పొలాలలో డ్రోన్ వినియోగాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో డ్రోన్ వినియోగంపై రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రోగో టెక్నాలిజీస్ డ్రోన్ ధర రూ.9.80 లక్షలు కాగా రాయితీతో రూ.7.84 లక్షలతో అందిస్తారన్నారు. రైతులకు దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, ఆధునిక పద్ధతుల్లో వ్యవయసాయాన్ని వృద్ధి చేసుకునేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య,ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, సెరికల్చర్ అధికారి పద్మావతమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్, రైతులు, కంపెనీ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

10న జాతీయ మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి-హిందూపురం

ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు మే 10వ తేదీన జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ తెలిపారు. రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ ఎంతో దోహదపడుతుందన్నారు. మే 10వ తేదీ ఉదయం 11 గంటలకు జాతీయ మెగా లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

పండ్ల మొక్కలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండలంలోని చిన్న సన్నకారు రైతులు పండ్ల మొక్కలకు దరఖాస్తులు చేసుకోవాలని ఏపీవో చంద్రశేఖర్ తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద 2025 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మండలంలోని చిన్న సన్న కారు రైతులు పండ్ల మొక్కలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రేషన్ కార్డు, పట్టాదారు పాస్ బుక్, జాబ్ కార్డు, ఆధార్ కార్డు, చిన్న సన్న కారు ఆన్లైన్ సర్టిఫికెట్ జిరాక్స్ జత చేసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర గల గండికోట హాస్పిటల్ లో శుక్రవారం ఉచిత గుండెవైద్య శిబిరం నిర్వహించారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మార్క్ హార్ట్ హాస్పిటల్ అనంతపురం వారి సహకారంతో ధర్మవరంలోనే మొట్టమొదటి క్యాంపు సందర్భంగా ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ నాగరాజు లచే రోగులకు ఉచిత వైద్య చికిత్సలను అందించడం జరిగిందన్నారు. అ ధర్మవరం ప్రజల కోరిక మేరకు ప్రతినెల నాలుగవ శుక్రవారం డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డిచే గుండె వైద్య చికిత్సలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ శిబిరంలో 130 మందికి వైద్య చికిత్సలను అందించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నంద, గండికోట హాస్పిటల్, మార్క్ హార్ట్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియాను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మలేరియాని నిర్మూలిద్దామని డిఎంహెచ్ఒ ఫిరోజా బేగం పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందిని ప్రభావితం చేస్తున్న ప్రాణాంతక వ్యాధి మలేరియా అని అన్నారు. డ్రైడే ఫ్రైడే పాటించి జ్వరాల బారిన పడకుండ ఉండాలన్నారు. అనంతరం యనమలపల్లి లో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జ్యోత్స్న , డాక్టర్ ముని చంద్రిక, సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, ఎఎంఒ లక్ష్మీ నాయక్, మునిసిపల్ శానిటరీఇన్స్పెక్టర్ శివయ్య, డిఎంఒ ఆఫీస్ సిబ్బందిపాల్గొన్నారు .

హిందూపురం : మలేరియా మహమ్మారి మనతోనే అంతం కావాలని లక్ష్మీపురం ఆరోగ్య కేంద్రం ఇన్‌ఛార్జి వైద్యాధికారణి డాక్టర్ అయిషా తస్నీమ్ పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఒ ముస్తఫాతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

ఎన్ఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్ర రావు

సమావేశంలో మాట్లాడుతున్న సూర్యచంద్రరావు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాజీ లేని పోరాటం చేస్తామని ఆసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్రరావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని సాయి ఆరామంలో ఆ అసోసియేషన్ కడప జోన్ ప్రథమ మహాసభను నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ వి రమణ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఎమ్‌డికి సమస్యలపై విన్నవించడం జరిగిందన్నారు. అయితే యాజమాన్యం నుంచి స్పందన లేదన్నారు. దీంతో నల్ల బ్యాడ్జీలతో నిరసన, గేట్ మీటింగ్ ద్వారా నిరసన తెలపడం జరిగిందన్నారు. ప్రధానంగా ఉద్యోగుల భద్రత సర్కులర్‌ను వెంటనే అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్‌లను, అక్రమ తొలగింపు లు ఆపాలని, నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని కేటగిరీలలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, నైట్ అవుట్ అలవెన్సులు రూ. 300 నుంచి 400 రూపాయలకు పెంచాలని, గ్యారేజీ సమస్యను పరిష్కరించాలని, పాత వైద్య విధానం అమలు చేయాలని, సిక్ లీవులలో కూడా వేదనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పారదర్శకమైన బదిలీ పాలసీని అమలు చేయాలన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించకుంటే దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కడప జోనల్ అధ్యక్షులుగా వినోద్ బాబు, కార్యదర్శి ఎం చెన్నారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల కోసం పోరాడుతామని ఎన్నికైన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పివి శివారెడ్డి, భాస్కర్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య, ఇస్మాయిల్, కడప జోన్‌లోని 8 జిల్లాల రీజనల్ అధ్యక్ష కార్యదర్శులు, 52 డిపోల అధ్యక్ష కార్యదర్శులు, గ్యారేజీ కమిటీ నాయకులతో పాటు స్థానికనాయకులు షబ్బీర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'లయోలా' పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని సాయినగర్ లయోలా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో విజయ దుందుభి మోగించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ శంకర నాయుడు తెలిపారు. తమ పాఠశాలలో 34 మంది విద్యార్థులకు గాను 32 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారన్నారు. 500 మార్కులకు పైగా పదిమంది విద్యార్థులు సాధించారన్నారు. పాఠశాలకు చెందిన సుమశ్రీ 587, కె.జోష్ణ 558, వి. మారుతి 540, వై. అక్షయ 552, యు. యశ్వంత్ 537 మార్కులు సాధించారన్నారు.

'పది' ఫలితాల్లో జీవానంద విద్యార్థుల హవా

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పదవ తరగతి పరీక్షా ఫలితాలలో పట్టణంలోని రేగాటిపల్లి రోడ్‌లోని జీవానంద ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. ఈసందర్భంగా ఆ పాఠశాల కరెస్పాండెంట్ శ్రీకాంత్, సంజీవరెడ్డి హెడ్మాస్టర్ దాదా కలందర్ మాట్లాడుతూ తమ పాఠశాలలో 100మందికి గాను 91 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. పాఠశాలకు చెందిన జి. వర్షా 591, బి. దీక్షిత్ రెడ్డి,ఎస్. జోత్స్న 584, ఎం. శివ చరణ్ తేజ్ 581 మార్కులు సాధించారన్నారు. 550 మార్కులు పైగా 15 మంది విద్యార్థులు, 500 నుండి 549 మార్కుల వరకు 18 మంది విద్యార్థులు సాధించారన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను వారు అభినందించారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న మహిళసంఘాల నాయకులు, అధికారులు

ప్రజాశక్తి - తనకల్లు

మహిళలు అన్నిరంగాల్లోనూ ముందు ఉండాలని డిఆర్‌డిఎ పీడీ నరసయ్య సూచించారు. మండల కేంద్రంలోని చౌడేశ్వరి రైతు ఉత్పత్తిదారుల సంస్థ, డిఆర్‌డిఎ ద్వారా రైతులతో కొనుగోలు చేసిన వేరుశనగ విత్తనాలను ఫ్లిప్‌కార్ట్ సంస్థ తో ఒప్పందం చేసుకొని వారికి సరుకును శుక్రవారం పంపించారు. ఈ వాహనాన్ని మండల అధ్యక్షురాలు సరోజమ్మ, జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ నరసయ్య మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో మొదటిగా తనకల్లు డిఆర్‌డిఎ వెలుగు ఆధ్వర్యంలో శ్రీ చౌడేశ్వరి రైతు ఉత్పత్తి దారుల సంస్థ ద్వారా ఈ కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ డిపిఎం శ్రీనివాసులు, డిపిఎం రామ్మోహన్, ఒడిసి క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ కె రవీంద్ర, ఎపిఎం జయంతి, ఎఫ్‌పిఒ రమణప్ప, నల్లచెరువు ఎపిఎం రమణప్ప, బాబ్జాన్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను తలపిస్తున్న ప్రయివేటు పాఠశాలల ప్రచారాలు

-కట్టడి చేయకపోతే ఆందోళనలు -ఎస్ఎఫ్ఐ పట్టణ కన్వీనర్ ఆఫ్రిద్

విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు అడ్మిషన్ల కోసం పడుతున్న తాపత్రయం ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తోందని ఎస్ఎఫ్ఐ పట్టణ కన్వీనర్ ఆఫ్రిద్, కో కన్వీనర్ అజ్మల్ అన్నారు. శుక్రవారం హిందూపురం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్ ఇంటింటా అడ్మిషన్ల ప్రచారం , ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తున్నాయన్నారు. పట్టణంలోనే కాకుండా నియోజవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ నారాయణ, చైతన్య, లోటస్, దీప్తితో పాటు ఇతర ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు పది ఫలితాల్లో విద్యార్థుల మార్కులు చూపిస్తూ తమ స్కూల్స్ గొప్పంటూ తమ స్కూల్ అంటూ బృందాలుగా ఏర్పడి ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండానే ముందస్తుగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని విమర్శించారు. జూన్ మొదటి వారం నుండి అడ్మిషన్లు చేసుకునే వెసులబాటు విద్యాశాఖ కల్పిస్తే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు మాత్రం తల్లిదండ్రులకు స్కూలు గొప్పలు చెబుతూ అడ్మిషన్లను సేకరించే పనిలో నిమగ్నమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ముందుగానే ప్రైవేట్ పాఠశాలల నిర్వహకులు పాఠ్యపుస్తకాలను అంటగడుతూ డబ్బులు దోచుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారి హిందూపురం నియోజవర్గ వ్యాప్తంగా ఉన్న మండలాల ఎంఇఒలు స్పందించి అడ్మిషన్లు సేకరిస్తున్న ప్రైవేటు కార్పొరేట్ స్కూల్స్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆయా పాఠశాలల ఎదుట ప్రత్యక్ష ఆందోళనలకు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బిలాల్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా, పురం అభివృద్ధికి ప్రతిపాదనలు

ముఖ్యమంత్రికి వివరించిన ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు

ప్రజాశక్తి-హిందూపురం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి

స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచనల మేరకు బాలయ్య పిఎ వీరయ్య, నియోజకవర్గ టిడిపి కోఆర్డినేటర్ శ్రీనివాసరావులు శుక్రవారం విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించారు. హంద్రీనీవా కాలువ ద్వారా నియోజకవర్గంలో ఉన్న అన్ని చెరువులకు నీళ్ల నింపాలంటే కాలువలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. హంద్రీనీవా కాలువల సమగ్ర అభివృద్ధి కోసం రూ. 1140 కోట్లు అవసరం ఉందని దీనికి సంబంధించి సమగ్ర ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి అందించారు. 2014 -19 మధ్యకాలంలో టిడిపి అధికారంలో ఉన్న సమయంలో హిందూపురం పట్టణంలో అంతర్గత రహదారులతో పాటు మురుగు కాలువల అభివృద్ధి కోసం రూ. 65 కోట్లు మంజూరు చేయడం జరిగింది. అయితే గత ప్రభుత్వం నిధులను విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని వివరించారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన అంచనాలు పెరిగాయని దీనికోసం రూ. 95 కోట్లు అవసరం ఉందని చెప్పారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పూర్తిస్థాయిలో నీటి సరఫరా అవుతున్నప్పటికీ పట్టణంలో ప్రతి ఇంటికి అందించలేకపోతున్నామని, ప్రతి ఇంటికి అందించాలంటే ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాలతో పాటు పట్టణంలో ఉన్న పైప్‌లైన్ మొత్తం మార్చాల్సి ఉందని, దీని కోసం రూ. 136 కోట్లు అవసరమవుతాయని వివరించారు. మొత్తం రూ. 1400 కోట్లకు సంబంధించి వివిధ అభివద్ధి పనులకు ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి ఇచ్చినట్లు పిఎ తెలిపారు. ఈ నిధులు విడుదలైన వెంటనే పనులను ప్రారంభించి, త్వర తగితిన పూర్తి చేసి, రాష్ట్రంలోనే హిందూపురం నియోజకవర్గాన్ని ఒక ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి అవసరమైన అన్ని చర్యలను ఎమ్మెల్యే బాలకృష్ణ తీసుకుంటున్నట్లు తెలిపారు.